# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు.**

2. **తీర ప్రాంతాలు సురక్షితంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **తెలంగాణను దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

4. **రాజధానిలో రెండవ విడత భూసమీకరణలో 16 వేల 667 ఎకరాలను సమీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. క్వాంటమ్ వ్యాలీ కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించిందని అధికారులు తెలిపారు. శంకుస్థాపన అనంతరం నిర్వహించే సభలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ప్రసంగించనున్నారు.

-------------------------

తీర ప్రాంతాలు సురక్షితంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సి.ఐ.ఎస్.ఎఫ్) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్--2026' రెండో ఎడిషన్ విశాఖపట్నానికి నిన్న చేరుకుంది. "సురక్షిత తీరాలు -- సమృద్ధ భారతం" అనే నినాదంతో చేపట్టిన ఈ కోస్టల్ సైక్లోథాన్ కు విశాఖ నగర ప్రజలు, అధికారులు, యువత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖలోని బీచ్ రోడ్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వందేమాతర గీతం ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు.

-------------------------

రాజధానిలో రెండవ విడత భూసమీకరణలో 16 వేల 667 ఎకరాలను సమీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. భూములిచ్చేందుకు రైతులు సుముఖంగానే ఉన్నారని పేర్కొన్నారు. రాజధానిలో మంత్రుల భవనాల నిర్మాణ పనులు, ఇతర పనుల పురోగతిని ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

తెలంగాణను దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, పూర్తైన పనులకు ప్రారంభోత్సవాలను ముఖ్యమంత్రి నిన్న నిర్వహించారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజి రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బర్దీపూర్ లో నిర్వహించిన 'ప్రజా పాలన–ప్రగతి బాట' బహిరంగ సభలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ళ కాలంలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు.

---------------------------

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపి వారిలో పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే శక్తిని నింపే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన పరీక్షా పే చర్చ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పరీక్షా పే చర్చలో భాగంగా నిన్న నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఒంగోలులోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వీక్షించారు. ప్రతి తరగతి గదిలో డిజిటల్ తెరలను విద్యార్థులు పరీక్షా పే చర్చ కార్యక్రమం తిలకించడానికి ఏర్పాటు చేశామని పీఎంశ్రీ జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ శివరామ్ తెలిపారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరమని విద్యార్థిని సాయి పల్లవి ఆకాశవాణికి తెలియజేస్తూ..

వాయిస్.. 20 సెకన్లు

కాగా.. పరీక్షా పే చర్చ 9వ సంచికలోని 2వ భాగం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రసారం అవుతుంది.

---------------------------

హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నగరంలోని హైటెక్స్ లో నిన్న నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాదులో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. కేవలం 2 ఏళ్లలోనే నగరాభివృద్ధికి 20 వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఐసిసి అండర్–19 వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ను భారత్ కైవసం చేసుకుంది. జింబాబ్వేలోని హరారేలో

ఇంగ్లాండ్ తో నిన్న జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 100 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ 40.4 ఓవర్లలో 311 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. గతంలో ఐదు సార్లు టైటిల్ విజేతగా నిలిచిన భారతజట్టు.. తాజాగా ఆరోసారి ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను సాధించడంతో దేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవతున్నాయి.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత జట్టుకు అభినందనలు తెలిపారు. అండర్-19 జట్టు ప్రపంచ కప్‌ను సాధించడం గర్వంగా ఉందని సామాజిక మధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. టోర్నమెంట్ మొత్తం జట్టు అద్భుతంగా ఆడి, అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించిందని తెలిపారు. ఈ విజయం అనేక మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వెల్లడించారు.

---------------------------

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయ ఆవరణలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై అన్నిశాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వెల్లడించింది. ఉత్తర కోస్తా, రాలయసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరంబీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. పలు చోట్ల పొగమంచు కురుస్తోంది.

======================